సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 14 । జులై । 2025



పెట్టిందే తిను
విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పాలకులతో పాటు ప్రభుత్వ అధికారులు ప్రచార ఆర్భాటం చేస్తున్నారు. - 8లో



ఆరోగ్య సిరి
అంతరించిపోతున్న చిరుధాన్యాలను రక్షిస్తూ నేటి తరాలకు పరిచయం చేసేందుకు చిరుధ్యా నాల విత్తన సంరక్షణతో పాటు, పంటల సాగు పెరుగుతోంది. - 8లో



హస్తకళల ఉత్పత్తులకు విశేష స్పందన - 8లో
లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనల(ఎగ్జిబిషన్)కు విశేష స్పందన లభించింది.

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్ వివరాలకు 1100 నంబరుకు కాల్ చేయొచ్చు..: కలెక్టర్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు ఐటీడీఏ అధికార వర్గాలు తెలిపాయి. గిరిజనులు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22వ తేదీలోగా ఏదైనా ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. సీతంపేట ఐటీఐలో ఈ నెల 23న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. వివరాలకు 75690 62449 నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా రేపు

విజయనగరం అర్బన్: తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రంగ ఉద్యోగ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు గిరడ అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ కార్యక్రమం తలపెట్టినట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన వాల్యుయేషన్ అమైండ్‌మెంట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎనిమిదో పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్స్ హెల్త్ ఇన్సురెన్స్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లంతా తరలి రావాలని సంఘ నేతలు పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని పెన్షనర్లంతా ధర్నాకు హాజరు కావాలని మరో ప్రకటనలో సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి త్రినాధప్రసాద్ కోరారు. సంఘటిత పోరాటం ద్వారానే డిమాండ్ల సాధన సాధ్యమవుతుందని దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ధర్నాలో పాల్గొనాలని వారు కోరారు.

బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు

విజయనగరం అర్బన్/బొబ్బిలి: ఇప్పటికే దేశ విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన బొబ్బిలి వీణకు మరో అరుదైన గుర్తింపు లభించింది. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) కింద బొబ్బిలి వీణ బహుమతికి ఎంపికైంది. ఓడీఓపీ అవార్డుకు రాష్ట్రం నుంచి 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపిక కాగా మన బొబ్బిలికి చెందిన నమూనా వీణ ఎంపిక కావడం జిల్లాకు గర్వ కారణంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని అందుకునేందుకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఢిల్లీ వెళ్లారు. కొత్త ఢిల్లీ ప్రగతి మైదానంలో భారత్ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఓడీఓపీ అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు.

బొబ్బిలి వీణకు అంతర్జాతీయ గుర్తింపు
బొబ్బిలి వీణకు దేశ విదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. బొబ్బిలి వీణ అని విస్తృతంగా పిలువబడే బొబ్బిలి నుంచి వచ్చిన సాంప్రదాయ 'సరస్వతి వీణ' విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. అలాగే సరస్వతి వీణను పోలి ఉండే చిన్నపాటి వీణను బహుమతిగా జ్ఞాపికగా ఇవ్వడం ఏళ్ల తరబడి సంప్రదాయంగా వస్తోంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం బొబ్బిలి నమూనా వీణలను జ్ఞాపికలుగా ఇవ్వడం జరుగుతోంది. బొబ్బిలి వీణ బొమ్మలతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు సైతం బొబ్బిలి వీణలు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో జరిగిన జీ-20 సదస్సులో, విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో సైతం బొబ్బి లి వీణ ప్రదర్శనలు జరిగాయి. అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్ ఈ వీణను చూసి ముచ్చటపడ్డారు. బొబ్బిలి వీణకు ఇప్పటికే మన కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లి, బాడంగి మండలం వాడాడ వీణల తయారీకి ప్రసిద్ధి చెందిన గ్రామాలు. వీణల తయారీ ఒక అరుదైన హస్త కళగా గుర్తింపు పొందింది. ఈ గ్రామాల్లో దాదాపు 300 కుటుంబాలు తమ జీవనోపాధి కోసం వీణల తయారీలో నిమగ్నమై ఉన్నారు. వీటి తయారీకి పనస మరియు సంపంగి కలప, చెక్కకు ఉపయోగిస్తారు.



భయపెడుతున్న బ్లాక్‌స్పాట్స్



- నిరంతరం రోడ్డు ప్రమాదాలు
- రోడ్డెక్కాలంటే వణుకు
- స్పాట్ల దగ్గర సైనేజ్ బోర్డుల్లేని వైనం
- జిల్లాలో 16 బ్లాక్‌స్పాట్లు
- ఏడాదిలో 252 ప్రమాదాలు
- 70 మంది మృతి
- 442 మందికి గాయాలు

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లా ప్రజలు బ్లాక్ స్పాట్ అంటే భయపడుతున్నారు. అక్కడ ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం వారిది. ఆ మార్గంలో ఆ స్పాట్ దాటితే చాలు.. హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలే దీనికి కారణం. జిల్లాలో బ్లాక్‌స్పాట్ల వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వందల మంది గాయాల పాలై క్షతగాత్రులుగా మారిపోతున్నారు. వీటితో పాటు సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లోని గిరిజన గ్రామాల్లో సైతం తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. 2024 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు ఏడాది కాలంలో జిల్లాలో 252 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో 70 మంది మృతి చెందారు. 442 మంది గాయాల పాలయ్యారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా 16 బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు.

అవగాహనకే పరిమితం

జిల్లా వ్యాప్తంగా ఓ వైపు పోలీసు సిబ్బంది, మరోవైపు ఆర్టీవో సిబ్బంది క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నా.. అవి అవగాహనకే పరిమితం అవుతున్నాయి. వాస్తవ పరిస్థితుల్లో, వాహనాలు నడిపేటప్పుడు నియమాలను పాటించకపోవడం, శిక్షణ లేకుండా వాహనాలను నడపడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యువత రేస్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ వంటివి ప్రమాదాలు చోటు చేసుకోవడానికి ప్రధాన కారణాలు.

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బ్లాక్ స్పాట్‌ల వద్ద పోలీసులు, రవాణా శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను పాటించాలి. రహదారి భద్రత నియమాలు పాటించని వారిపై జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తాం.
– టి.దుర్గాప్రసాద్ రెడ్డి,
జిల్లా రవాణా శాఖాధికారి, పార్వతీపురం మన్యం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు (ఫైల్)



పార్వతీపురం పట్టణంలో మృతి చెందిన గుంపస్వామి (ఫైల్)

బ్లాక్‌స్పాట్లపై సైనేజ్ బోర్డులు లేని వైనం



జిల్లా వ్యాప్తంగా నిరంతరం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న బ్లాక్‌స్పాట్ల వద్ద సైనేజ్ బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు ఉంటే అతివేగంగా వెళ్లే అవకాశం ఉండదని, ఫలితంగా సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. పోలీసులు, ఆర్టీవో సిబ్బంది కేవలం చలానాలు విధించడంపై శ్రద్ధ చూపుతున్నారే తప్ప రహదారి ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు.

జిల్లాలో బ్లాక్ స్పాట్‌లు

పరిధి	బ్లాక్ స్పాట్
పాచిపెంట	ఘాట్ రోడ్డు దుర్గ గుడి నుంచి 500 మీటర్లు సుంకి వైపు
సాలూరు	మామిడిపల్లి జంక్షన్ నుంచి 500 మీటర్లు
సాలూరు	గాంధీనగర్ జంక్షన్ నుంచి 500 మీటర్లు
కొమరాడ	అర్తాం గ్రామం నుంచి గుణానపురం వరకు
కొమరాడ	చోళ్లపదం కూడలి నుంచి 0.8 కిలోమీటర్లు
కొమరాడ	సూరంపేట కూడలి నుంచి సివిని సూర్య స్కూల్ వరకు
పార్వతీపురం	పార్వతీపురం రూరల్ లిమిట్ బోర్డు నుంచి నర్సిపురం జనహిత పాఠశాల వరకు
పార్వతీపురం	బ్యాంకాఫ్ బరోడా నుంచి పెట్రోల్ బంక్ వరకు
పార్వతీపురం	నర్సిపురం మెయిన్ రోడ్డు నుంచి టీబీఆర్ థియేటర్ వరకు
పార్వతీపురం	వైకేఎం కాలనీ నుంచి వెంకంపేట గోరీల జంక్షన్ వరకు
పార్వతీపురం	ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కొత్తవలస వరకు
పార్వతీపురం	కొత్తవలస శివాలయం జంక్షన్ నుంచి అడ్డాపుశీల పెట్రోల్ బంకు వరకు
పాలకొండ	అత్తిలి జంక్షన్ నుంచి పణుకువలస జంక్షన్ వరకు
పాలకొండ	వెలగవాడ జంక్షన్ నుంచి సిరికొండ జంక్షన్ వరకు
పార్వతీపురం	వెంకంపేట వై.జంక్షన్ నుంచి జగనన్న కాలనీ వరకు

పంటల బీమాతో ప్రయోజనం

- జూలై 15లోగా పత్తి, అరటి పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలి
- ఈ నెల 31లోగా మొక్కజొన్న ప్రీమియం, ఆగస్టు 15లోగా వరి పంట ప్రీమియం చెల్లించాలి
- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: రైతులు పంటలకు బీమా చేయించుకుంటే ఎంతో ప్రయోజనమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు పంట బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ఆదివారం నిర్వహించారు. బీమాపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులకు తక్కువ ప్రీమియం చెల్లింపుతో బీమా పథకం అమలు జరుగుతుందని ఆయన చెప్పారు. ఫసల్ బీమా యోజనను ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీలు ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. ఎంపిక చేసిన పంటలకు బీమా చేసిన మొత్తానికి రెండు శాతం, వాణిజ్య – ఉద్యాన పంటలకు 5 శాతం చెల్లించాలని చెప్పారు. వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని బీమా సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని ఆయన తెలిపారు. రైతులు వరి పంటకు ఆగస్టు 15వ తేదీ లోగా, మొక్కజొన్న పంటకు జూలై 31వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. పత్తి, అరటి పంటల బీమా జూలై 15వ తేదీలోగా చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లాలో వరి పంటకు ఎకరాకు రూ.40 వేలు
పార్వతీపురం మన్యం జిల్లాలో వరి పంటకు ఎకరాకు రూ.40 వేలు ప్రీమియం చెల్లించాలని, అయితే రైతులు తమ వాటాగా రూ.8 వందలు చెల్లిస్తే సరిపోతుందని, మిగిలిన మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రైతు వాటా రూ.330 అన్నారు. పత్తి పంటకు ఎకరాకు రూ.1923 ప్రీమియం కాగా రైతు వాటా కింద రూ.98 చెల్లించాలని, అరటి పంటకు రూ.3036 కాగా రైతు వాటా కింద రూ.152 చెల్లించాలని ఆయన చెప్పారు. రైతులు ప్రీమియంను తమ సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్, పీఏసీఎస్, పోస్టాఫీసుల ద్వారా రైతుల ఆధార్, భూమి, కౌలు కార్డు, పంట వేసిన ధ్రువ పత్రాన్ని, బ్యాంకు వివరాలకు సంబంధించిన పత్రాలను సమర్పించి ఆన్ లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చన్నారు.

రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు
రైతులు ఎటువంటి దళారులని, మధ్యవర్తులని నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు. పంట వేసిన ధ్రువపత్రం జారీ నిమిత్తం కూడా ఎటువంటి మొత్తాన్ని రైతు సేవ కేంద్రంలోని సిబ్బందికి చెల్లించనవసరం లేదని ఆయన చెప్పారు. గడువు తేదీ ముందుగానే తమ ప్రీమియం చెల్లింపు చేసి తగు రసీదు పొందాలని సూచించారు. బీమా వేసిన పంట వివరాలు ఇ – పంట లో సక్రమంగా నమోదు అయ్యాయో లేదో సరిచూసుకోవాలని ఆయన సూచించారు. తద్వారా దరఖాస్తుల పూర్తి ఆమోదం సులభంగా జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- ఉప్పాల హారికపై టీడీపీ, జనసేనల దాడి దారుణం
- కూటమి ప్రభుత్వ తీరుపై ఎంపీ తనూజారాణి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న అరకు ఎంపీ తనూజారాణి, పక్కన మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గుండాల దాడిని ఆమె ఖండించారు. మండలంలోని వండువ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఒక బీసీ మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలైన హారిక గుండాల దాడిలో భయంతో వణికిపోయారని ఇంతకంటే దారుణం ఉంటుందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కక్షసాధింపులు, వేధింపులు, దాడులు, దౌర్జన్యాలతో ఏడాది పాలన గడిపేశారన్నారు. కూటమి నేతల అరాచకాలకు బలవుతున్న వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తల్లికి వందనం పేరిట తల్లిదండ్రులను మోసం చేసిందని ఆరోపించారు.

వెంకటరాజపురం పంట పొలాల్లో ఏనుగుల సంచారం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం పంట పొలాల్లో ఏనుగులు ఆదివారం రాత్రి దర్శనమిచ్చాయి. సాయంత్రం బాసంగి పంట పొలాల్లో ఉన్న ఏనుగులు రాత్రి 7 గంటల సమయంలో వెంకటరాజపురం వరి నారుమళ్లను ధ్వంసం చేశాయి. బాసంగిలో అరటి పంటను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అంతా మొక్కతోట కావంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.



పంట పొలాల్లో ఏనుగులు

పడిపోయిన నిమ్మ ధర

- సీతంపేట మార్కెట్‌కు భారీగా నిమ్మకాయలు
- బస్తా నిమ్మ ధర రూ.500లు
- గతంలో ఇదే సీజన్‌లో బస్తా రూ.5వేలు



వ్యాపారులు కొనుగోలు చేసిన నిమ్మకాయలు

సీతంపేట: సీతంపేట మార్కెట్‌కు భారీగా నిమ్మకాయలు ఆదివారం వచ్చాయి. అనుకున్న ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందారు. గతంలో 50 కిలోల వరకు ఉన్న నిమ్మ బస్తా రూ.5 వేలు పైబడి పలుకగా ఇప్పుడు బస్తా రూ.500లకు పడిపోయిందని నిమ్మ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖపట్నం, ఒడిశా, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసుకుని వెళ్లారు. కొండపోడు వ్యవసాయంలో భారీగా ఈ ఏడాది మంచి దిగుబడులు వచ్చాయి. దిగుబడులు వచ్చిన వాటిని సీతంపేట, కుశిమి, మర్రిపాడు వారపు సంతల్లో విక్రయిస్తారు. ఇప్పుడు ధరలు పూర్తిగా పడిపోయాయని గిరిజనులు వాపోతున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ, సరండర్ లీవ్ క్యాష్‌ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక ఆపస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లు దాటినా పీఆర్‌సీ కమిషన్ నియమించలేదని ఆరోపించారు. వెంటనే కమిషన్ వేసి కనీసం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఇ.రామునాయుడు, అదనపు ప్రధాన కార్యదర్శి చిన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సంతోషలక్ష్మి, గౌరవాధ్యక్షులు వీవీ శ్రీహరి, కోశాధికారి ఏజీ తాతారావు, జిల్లా మహిళా ప్రతినిధి పద్మలత, విశాఖ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, వెంకటనాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బాగుకు ఒక్కటయ్యారు...

- నిధులు పోగు చేశారు..
- తరగతి గదిని నిర్మించుకుంటున్నారు..



పాఠశాల బాగుకు కూలీలుగా మారిన గాజులగూడ గిరిజనులు

కొమరాడ: తమ గ్రామ పాఠశాల బాగుకు ఆ గ్రామస్తులంతా ఒక్కటిగా ముందుకు కదిలారు. అధికారులు, పాలకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. అయినా ఫలితం లేకపోయింది. ఇక మన పాఠశాలను మనమే బాగు చేసుకుందామని అంతా ఒక్కటిగా ముందుకు సాగారు. ఒక్కో కుటుంబం నుంచి రూ.400లు సేకరించారు. ఆ గ్రామస్తులే.. గాజులగూడ గిరిజనులు. వివరాల్లోకి వెళ్తే.. కొమరాడ మండలం కెమిశీల పంచాయతీ గాజులగూడ గ్రామంలో 110 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయులు ఐదుగురున్నారు. ఈ ఏడాది ఈ పాఠశాల మోడల్ ప్రైమరీ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయింది. ఒకే తరగతి గది ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తమ పిల్లల భవిష్యత్ కోసం రెండు దశాబ్దాల కిందట మంజూరైన అదనపు గది అసంపూర్ణంగా ఉండడంతో ఆ గదినే రేకుల షెడ్‌తో నిర్మించుకుంటున్నారు. ఇందుకు గ్రామస్తులు పోగు చేసిన రూ.50వేలు ఖర్చు పెడుతున్నారు. అదే సమయంలో ఈ పనుల్లో గ్రామస్తులే కూలీలుగా మారి అధికారులు, పాలకులకు కనువిప్పు కలిగేలా పని చేస్తూ పాఠశాల బాగుకు నడుం బిగించారు.



నిర్మాణ పనులు చేస్తున్న గిరిజనులు

అధికారుల చుట్టూ తిరిగాం..



మా పాఠశాలలో 55 మంది విద్యార్థులున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల గదుల నిర్మాణం కోసం అధికారులు, పాలకుల చుట్టూ తిరిగాం. అయినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తామే ఒక్కటిగా నిలిచి విరాళాలు పోగు చేసి పాఠశాలలో అదనపు తరగతి గదిని నిర్మించుకుంటున్నాం.
– కుద్రక మల్లేశ్వరరావు,
గాజులగూడ

మరో 200 క్యూసెక్కుల నీరు...

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి విడుదలను ఆదివారం అధి కారులు మరింత పెంచారు. గత ఐదు రోజులు గా 100 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు సరఫరా చేయగా, ప్రస్తుతం ఆయకట్టులో దమ్ము లు, ఉబాలు ఊపందుకోవడంతో మరో 200 క్యూసెక్కుల అదనపు నీటిని పెంచుతూ మొ త్తం 300 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు భూ ములకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు.

జిల్లాలోని ఏడు మండలాల్లో 30,077 ఎకరాల భూములకు నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రాజెక్టు వద్ద 64.54 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైందన్నారు.



కుడి ప్రధాన కాలువ ద్వారా విడుదలవుతున్న సాగునీరు

క్లుప్తంగా

ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లా శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయుఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా బల్లా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాలాజీ ప్రకటించారు. ఇంతవరకు ఈ బాధ్యతలను చేపట్టిన వీవీజే సుబ్రహ్మణ్యంను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణానికి వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ స్థానిక సంఘం కార్యాలయంలో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఐటీఐలలో రెండవ విడత ప్రవేశాలకు గడువు పొడిగింపు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 20 తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ విజయనగరం ప్రిన్సిపాల్ టీవీగిరి తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20వ తేదీ రాత్రి 11.55 గంటలలోపు ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ యూనిక్ నంబర్‌తో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు సమీపంలోని ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో కౌన్సెలింగ్ ఈ నెల 23 నుంచి 25వ తేదీవరకు, ప్రైవేట్ ఐటీఐలో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. లాగిన్ సమయంలో ఎస్ఎస్‌సీ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా అభ్యర్థి వివరాలు ప్రదర్శితమవుతా యన్నారు. వెంటనే జరేట్ అయిన యూనిక్ నంబర్‌తో కూడిన ప్రింటవుట్‌తో ఏదైనా జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించాలని, వెల్డర్, ప్లంబర్ ట్రేడ్‌లకు 8వ తరగతి, ఇతర ట్రేడ్‌లకు 10వ తరగతి ఉత్తీర్ణత విద్యార్హతగా తీసుకుంటామని చెప్పారు. ఆధార్‌లో అనుసంధానించిన మొబైల్ నంబర్‌తోనే రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9441518355, 9849944654, 7780658035 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు ఢీకొనడంతో ఎల్.కోట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన తూర్పాటి లోకేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. లోకేష్ ద్విచక్రవాహనంపై కొత్తవలస నుంచి స్వగ్రామం సీతారాంపురం వెళ్తుండగా ఎస్.కోట నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో లోకేష్ తలకు తీవ్రగాయాలు కాగా అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారస్థితికి చేరుకున్నాడు. స్థానికుల సహాయంతో 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం లోకేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఎల్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐఆర్‌ఓ ఎస్.తవిటినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్ట్‌ల భర్తీ కోసం అర్హులైన రిటైర్డ్ అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్స్, లెక్చరర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఫ్రెష్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డీవీఈఓ ఆధ్వర్యంలో జరిగే ఈ నియమకాలలో తొలి ప్రాధాన్యం రిటైర్డ్ అధ్యాపకులకేనని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలని తెలిపారు. ఈ నెల 16న స్థానిక లంకవీధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు చేపడతామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలల వారీగా ఫ్యాకల్టీ ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల గంట్యాడ, కొత్తవలసలో ఒక్కో ఫ్యాకల్టీ (జంతుశాస్త్రం), డెంకాడ, ఎస్.కోటలో ఒక్కో ఫ్యాకల్టీ (గణితం), ఎస్.కోటలో జనరల్, ఫౌండేషన్ కోర్సు-1, దత్తిరాజేరులో భౌతిక శాస్త్రం-1, సంతకవిటిలో ఇంగ్లీష్-1 ఉన్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలో..

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిషరీస్ (ఒకేషనల్) సబ్జెక్టులో బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో పార్వతీపురం ప్రభుత్వజూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 15న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీవీఈఓ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

పెట్టిందే తిను

- గిరిజన హాస్టల్స్‌లో అమలు కాని మెను
- భోజనంలో నాణ్యత అంతంతే
- ఆశ్రమ పాఠశాలలపై అంతులేని నిర్లక్ష్యం



తెల్ల అన్నం, పలుచటి రసం వడ్డిస్తున్న కుక్, విద్యార్థి



రసంతో తెల్ల అన్నం, వండిన గుడ్డుతో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



వండిన గుడ్డు పెడుతున్న విద్యార్థి

రామభద్రపురం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పాలకులతో పాటు ప్రభుత్వ అధికారులు ప్రచార అర్భాటం చేస్తున్నారు. కానీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.పేద కుటుంబాలకు చెందిన గిరిజన విద్యార్థులే కదా ఫర్వాలేదు. ఏది వండేసి పెట్టిన తినేస్తారులే అని పాలకులతో పాటు అధికారులూ భావిస్తున్నారు. వసతిగృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులంటే నిర్లక్ష్యం చూపుతున్నారు. అందుకు నిదర్శనం రామభద్రపురం మండలంలోని నేరెళ్లవలస ప్రభుత్వం గిరిజన సంక్షేమ వసతి గృహంలో ప్రభుత్వం అందించిన మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందడం లేదు.అధికారుల పర్యవేక్షణ లేక ఆహారంలో నాణ్యత కరువవుతోందని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన ఆశ్రమ పాఠశాలల అండ్ ప్రీ మెట్రిక్ హాస్టల్ వారి ఆహార పట్టిక ప్రకారం ఆదివారం ఉదయం గోధుమపూరీ, బంగాళాదుంప బఠాణీ కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు పెట్టాలి. అలాగే ఉదయం అల్పాహారంగా వేరుశనగ చిక్కి ఇవ్వాల్సి ఉంది.మధ్యాహ్నం నాణ్యమైన చికెన్ బిర్యానీ,పెరుగు చెట్నీ, గోంగూర చెట్నీతో భోజనం వడ్డించాలి. అక్కడి నిర్వాహకులు ఇవేవీ పెట్టకుండా మెనూ చార్ట్‌ను పక్కన పడేసి వాటికి బదులుగా ఉదయం గంజి అన్నం, మధ్యాహ్నం తెల్ల అన్నం, రసం, వండిన గుడ్డు పెట్టేసి సరిపెట్టారు.

నాణ్యత అంతంతే..

వసతి గృహంలో విద్యార్థులకు పెట్టిన భోజనంలో నాణ్యత అంతంత మాత్రంగానే ఉంది. మెత్తగా ముద్ద అన్నం, పలుచటి చారుతో వడ్డిస్తూ ఆదా చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి భోజనంతో పాటు పండ్లు ఇవ్వాలి కానీ పండ్లు ఇవ్వకుండా నాసిరకం భోజనంతో మమ అనిపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.చాలా వసతి గృహాల్లో ఆదివారం చికెన్ బిర్యానీకి బదులు కర్రీతోనే సరిపెడుతున్నారు. ఎక్కడా చికెన్ బిర్యానీ ఇవ్వడం లేదని తెలిసింది. బిర్యానీకి తగ్గట్లు ఆహార పదార్థాల సరఫరా లేకపోవడడంతో అన్నంతో సరిపెడుతున్నారని సమాచారం.

55 మందే హాజరు..

జన్నివలస పంచాయతీ పరిధిలోని నేరెళ్లవలస ఆశ్రమ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 85 మంది ఉన్నారు, ఆదివారం హాస్టల్‌ను పరిశీలించగా 55 మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనంలో కనిపించారు. వారంతా భోజనం చేశారు.రెండు సెలవులు రావడంతో మిగిలిన 30 మంది సొంతూళ్లకు వెళ్లారని ఇక్కడి ఏఎన్ఎం తెలిపారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయక భోజనం అధ్వానంగా ఉండడంతో పాటు తాగునీటి సమస్య ఉంది. వారంతా పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతలో ఉన్న కొళాయి ట్యాప్ ద్వారా సరఫరా అవుతున్న నీటినే తాగుతున్న దుస్థితి ఉంది. గిరిజన ఆశ్రమ పాఠశాలలను సంబంధిత అధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉండాల్సిన వసతి గృహం వార్డెన్ ఇక్క ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

వార్డెన్ ఇలానే వండమన్నారు..

ఈ రోజు ఉదయం గంజి అన్నం పెట్టాం. మధ్యాహ్నం తెల్లం అన్నం, రసం, గుడ్డు వండమని వార్డెన్ సార్ చెప్పారు. అందుకు ఇలాగే వండాను. ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్‌కు చికెన్ బిర్యాని వండాం గనుక, ఈ రోజు ఇలాగాఏ వండమంటే ఆయన చెప్పిన విధంగానే వండాను.

లచ్చయ్య, కుక్

పేరెంట్స్ మీటింగ్‌లో చికెన్ బిర్యానీ పెట్టాం..

ప్రతిరోజూ మెనూ చార్ట్ ప్రకారం నాణ్యమైన ఆహారం వండిపెడుతున్నాం. కాకపోతే ఈ నెల 10వ తేదీన జరిగిన పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు వచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థుల కోసం చికెన్ బిర్యానీ పెట్టడం వల్ల అడ్జస్ట్‌మెంట్ కోసం ఈ రోజు అన్నం, గుడ్డు వండిపెట్టాం. ఇక నుంచి మెనూ ప్రకారం వండిపెడతాం.

కె. సోములు, వార్డెన్

విజయనగరంలో 66వ.. జీఆర్‌టీ జ్యువెల్లర్స్ షోరూమ్ ప్రారంభం



విజయనగరం: భారతదేశం, సింగపూర్‌లలో 65కు పైగా షోరూమ్‌లతో వినియోగదారుల విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగుతున్న జీఆర్‌టీ జ్యువెల్లర్స్ విజయనగరంలోని ఎంజీ రోడ్డులో గల దాబా గార్డెన్‌లో తన 66వ షోరూమ్‌ను ఆదివారం గ్రాండ్‌గా ప్రారంభించింది. తమ బ్రాంచ్ ప్రారంభోత్సవం గురించి జీఆర్‌టీ జ్యువెల్లర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ మాట్లాడుతూ విజయనగరం షోరూమ్ ప్రారంభం మా విజయయాత్రలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందన్నారు.

జిల్లాలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్'

- 512 కేసులు నమోదు
- రూ.1,13,900 జరిమానా



ఆపరేషన్ సేఫ్ జోన్ పేరుతో పాన్ షాపుల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: విద్యాసంస్థల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరిట చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఖైనీలు వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు ఆదివారం పలు కాలేజీ యాజమాన్యాలను హెచ్చరించారు. గడిచిన ఐదు రోజుల్లో 512 కేసులు నమోదు చేసి, రూ.1,13,900/ జరిమానాను కోప్టా చట్టం కింద విధించామని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. గడిచిన ఐదు రోజులుగా జిల్లావ్యాప్తంగా విద్యా సంస్థలకు సమీపంలోని పాన్‌షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించిన 512మంది వ్యాపారులపై కోప్టాచట్టం (ది సిగరెట్స్ అండ్ అదర్ పొగాకు ప్రొడక్ట్స్ 2003 చట్టం) ప్రకారం కేసులు నమోదు చేసి, వారిపై రూ.1,13,900/ లను జరిమానా విధించామన్నారు. విద్యాలయాలకు దగ్గరలో ఉన్న పాన్ షాపుల్లోను, కిరాణా షాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం వల్ల విద్యార్థులు వాటిని వినియోగించేందుకు అలవాటుపడి, వక్రమార్గంలో ప్రయాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు చేపట్టేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు స్వస్తి పలకాలని ఎస్పీ కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో సంబంధిత సీఐలు, ఎస్ఐలు పాల్గొనగా, డీఎస్పీలు పర్యవేక్షించారు.

ఆరోగ్య సిరి

- అన్ని చోట్ల చిరుధాన్యాలకే ప్రాధాన్యం
- కొండల్లో విస్తరిస్తున్న మిల్లెట్స్ సాగు
- పట్టణాల్లో పెరుగుతున్న వినియోగం



కొర్ర పంట వెన్నులు చూపుతున్న గిరిజనుడు



తివ్వాకొండల్లో చిరుధాన్యాల పంట సిరులు



మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాల



ఆధునిక పరికరాలతో కలుపు నివారణపై శిక్షణ

జిల్లాలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం..	
భామిని	265 ఎకరాలు
సీతంపేట	266 ఎకరాలు
వీరఘట్టం	176 ఎకరాలు
గుమ్మలక్ష్మీపురం	123 ఎకరాలు
కురుపాం	284 ఎకరాలు
పాచిపెంట	196 ఎకరాలు

భామిని: అంతరించి పోతున్న చిరుధాన్యాలను రక్షిస్తూ నేటి తరాలకు పరిచయం చేసేందుకు చిరుధ్యానాల విత్తన సంరక్షణతో పాటు, పంటల సాగు పెరుగుతోంది. సంప్రదాయ పంటలుగా పురాతన కొండ పంటలుగా పిలిచే మిల్లెట్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ సాగు విస్తరణ పెంచుతున్నారు. ఐటీడీఏల పరిధిలో మిల్లెట్స్ సాగు విస్తరణ ప్రణాళిక అమలవుతోంది. ఏపీపీఐ సంస్థ ఆర్థిక సహకారంతో గిరిజనులకు చిరుధాన్యాల విత్తనాలు సేకరించి ఉచితంగా అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో కొండ పంటలు సాగు చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకృతి సాగు, మిశ్రమ సాగు విధానంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మిల్లెట్స్‌పై అవగాహన పెంచుతున్నారు.దీంతో చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, గంటెలు, రాగులు, జొన్నలు, ఊదలు, అరికెల సాగు పెరుగుతోంది..

ఔషధ గుణాల సమ్మిళితం

తృణధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన వరాలు. ఔషధ గుణాల సమ్మిళితమైన తిండి గింజలు. ఆరోగ్య గుళికలుగా వీటిని వర్ణిస్తారు.ఇవి తింటూ ఆరు నెలల నుంచి రెండేళ్ల లోపు వ్యాధులను నిర్మూలించుకోవచ్చు.రోగ కారణాలను శరీరం నుంచి తొలగించి దేహాన్ని శుద్ధి చేస్తాయి. తృణధాన్యాలలోని పీచు పదార్థం రక్షణగా నిలుస్తుందని న్యూట్రిస్టులు చెబుతున్నారు. రోజుకు మనిషికి 38 గ్రాముల పీచు పదార్థం అవసరం. చిరుధాన్యాల్లో 25 నుంచి 30 గ్రాముల పీచు పదార్థం లభిస్తుంది. కూరగాయలు, ఆకు కూరల్లో పీచు పదార్థం పొందవచ్చు. కొండపోడు భూముల్లో చేపట్టే చిరుధాన్యాల సాగు పల్లపు ప్రాంతాల భూముల్లోనూ విస్తరిస్తున్నారు. ఆధునిక వ్యవసాయ విధానంలో నాట్లు వేయడం, కలుపు నివారణ, చీడపీడల నివారణకు కషాయాల వైద్యంతో సాగు చేస్తున్నారు. చిరుధాన్యాల పంటలకు తోడు పప్పుధాన్యాలు, కూరగాయల పంటలను మిశ్రమ పంటలుగా పండిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో



సంప్రదాయ పంటల సాగును పునరుద్ధరిస్తున్నాం. ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం పెంచాం. పండించిన చిరుధాన్యాలు మిగులు పంటకు మార్కెట్‌లో విలువ వచ్చేలా చర్యలు చేపట్టాం. పట్టణాల్లో పెరుగుతున్న వాడకానికి తగ్గట్లు పండించడానికి గిరిజన ప్రాంతాల్లో సమాయిత్తం చేస్తున్నాం.

కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

రైలు కింద పడి ఒకరి మృతి



నెహ్రూ పార్క్ వద్ద వృద్ధుడి మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మరడాం వద్ద రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వృద్ధుడు దాసరి తవిటయ్య(70) మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల కేంద్రానికి చెందిన తవిటయ్య ఎందుకు ఇక్కడికి వచ్చాడో ఎక్కడికి వెళ్లడానికి పట్టాలు దాటుతున్నాడో తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై పాచిపెంట గ్రామస్తులకు సమాచారం అందించి మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



ప్రమాదంలో మృతిచెందిన ధర్మారావు

సాలూరు రూరల్: మండలంలోని నెలిపర్తి సమీపంలో బైపాస్ రోడ్డు పై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాలూరు పట్టణంలోని గొర్లెవీధికి చెందిన గొర్లె ధర్మారావు (38)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆదివారం ఉదయం అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం పనులకోసం కుమారుడితో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆయన ప్రమాదంలో మృతిచెందగా కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

విజయనగరం క్రైమ్: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెహ్రూ పార్క్ వద్ద 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు ఆదివారం గుర్తించారు. తెల్లటి చొక్కా, తెల్లని గెడ్డం, దుప్పటి, స్టీల్ ప్లేట్ మృతదేహం వద్ద ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిలా ఉన్నాడని, మృతదేహాన్ని గుర్తించిన వారు ఫోన్ 9154874474, టూటౌన్ సీఐ 9121109420 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కంటకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద మహిళ మృతదేహం



రైల్వే ట్రాక్ వద్ద గుర్తించిన మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్/జామి: జిల్లాలోని కంటకాపల్లి రైల్వే స్టేషన్‌వద్ద ఓ మహిళ మృతదేహాన్ని జీఆర్పీ సిబ్బంది ఆదివారం కనుగొన్నారు. కంటకాపల్లి–అలమండ రైల్వేస్టేషన్ల మధ్య మెయిన్ డౌన్‌లైన్ ట్రాక్ మధ్య పడి ఉన్న మహిళ వయస్సు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉంటుందని ఐదడుగుల ఐదంగుళాల పొడవు, ఎరుపు రంగు ఛాయతో, పసుపు, గ్రీన్, గోధుం రంగు గల నైటీ ధరించి ఉందని ఎవరైనా గుర్తిస్తే ఫోన్ 919490617089, 919182073593, 08912883218 నంబర్లకు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ హెచ్‌సీ రవికుమార్ కోరారు.

ఘనంగా ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

- విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- సీహెచ్ పావని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పావని

విజయనగరం గంటస్తంభం: రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఘనంగా ముగిశాయి. రెండవ రోజు సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ పావని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచిందని కానీ ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని విమర్శించారు. సంవత్సర కాలం పాటు సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వానికి గడువు ఇచ్చామని ఆ సమస్యలు తీరకపోవడంతో ఈ ప్లీనరీ సమావేశాల స్ఫూర్తితో ఉద్యమాలు రూపొందిస్తామని హెచ్చరించారు. రాబోయే కాలం పోరాటాల కాలమని ఎస్ఎఫ్ఐ నాయకత్వాన విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించాలని కోరారు. డిగ్రీలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్‌లోనే అడ్మిషన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాజాం, గజపతినగరం, విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. 107,108 జీవోలను రద్దు చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ల అమ్మకాన్ని ఆపాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి రాము, సీహెచ్ వెంకటేష్‌లు మాట్లాడుతూ జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్లీనరీ సమావేశాల స్ఫూర్తితో పోరాటం సాగిస్తామని ప్రభుత్వం చొరవ చూపించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, ఒ.రవికుమార్, ఎస్.సమీర, ఎం.వెంకీ, పి.రమేష్, కె రమేష్ జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.శిరీష, సోమేష్, ఈ వంశీ, కె.రాజు పాల్గొన్నారు.

హస్తకళల ఉత్పత్తులకు విశేషస్పందన

- కొనుగోలుకు జనం ఆసక్తి
- విజయనగరంలో 20వ తేదీ వరకు హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ఎగ్జిబిషన్ స్టాల్స్



తమిళనాడు 1 గ్రామ్ గోల్డ్ హారాలు, ఆభరణాల స్టాల్

విజయనగరం అర్బన్: చేనేత వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు స్థానిక లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనల(ఎగ్జిబిషన్)కు విశేష స్పందన లభించింది. వివిధ రాష్ట్రాల నుంచి నేరుగా చేనేత వస్త్రాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన హస్తకళలను ప్రోత్సహించాలని కోరారు.

ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాల ఉత్పత్తులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల తయారీదారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రదర్శనలో విక్రయిస్తున్నారు. స్వయం ఉపాధి కార్మికులు స్వయంగా తయారు చేసిన హస్తకళలను ప్రోత్సహించాలని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయనగరం చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు.